క్లుప్తంగా

సమ్మె విజయవంతం చేయండి



నిమ్మపల్లిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు

కోనరావుపేట: దేశ్యాప్తంగా జూలై 9న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. ఈమేరకు సమ్మె కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశాకార్యకర్తలు, గ్రామపంచాయతీ కార్మికులతోపాటు అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. లింగంపల్లి శంకర్, సామర్ల రమేశ్, భుక్యా రవి, అల్లెపు వెంకట్, సుశీల, దేవవ్వ పాల్గొన్నారు.

వనమహోత్సవం విజయవంతం చేయండి



కనగర్తిలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

కోనరావుపేట(వేములవాడ): గ్రామాల్లో వనన ర్సరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి కోరారు. మండలంలోని కనగర్తిలో నర్సరీని, మామిడిపల్లిలో గుంతలు తవ్వే కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. అన్ని గ్రామాల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఇందుకోసం గుంతలు తవ్వే పనులు 10 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. వర్షాలు పడిన తర్వాత మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో శంకర్‌రెడ్డి, ఏపీవో మంచికట్ల శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి ఎస్సైగా లక్ష్మణ్



వీర్నపల్లి: వీర్నపల్లి ఎస్సైగా శనివారం వేముల లక్ష్మణ్ బాధ్యతలు స్వీకరించారు. పలువురు నాయకులు ఎస్సై లక్ష్మణ్‌తోపాటు బదిలీపై వెళ్లిన ఎస్సై ఎల్లయ్యగౌడ్‌ను శాలువాతో సత్కరించారు.

ఆర్థికంగా ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లు



ఇల్లంతకుంట: ఇందిరమ్మ ఇళ్లు ఆర్థికంగా ఉన్న వారికి, ఉద్యోగులు కేటాయించారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైనవారికి లబ్ధి చేకూరడం లేదన్నారు. మండలానికి 805 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వాటిలో ఎంతమంది నిరుపేదలకు ఇచ్చారో చెప్పాలన్నారు. నాయకులు గొట్టిపర్తి పరశురాములు, ఎండి సాదుల్, సావనపెల్లి అనిల్, కూనబోయిన రఘు, రాగటి రమేశ్, గుర్రం తిరుపతిరెడ్డి, దేవయ్య, సదానందం, తదితరులున్నారు.

బీజేపీ మండల కార్యవర్గం



ఎల్లారెడ్డిపేట: బీజేపీ మండల కార్యవర్గాన్ని మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నియామకం చేశారు. మండల ఉపాధ్యక్షులుగా శాగ లక్ష్మణ్, మల్లారపు మహేశ్, భైరవుని బాలాగౌడ్, కొండాపురం సత్యంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దాసరి గణేశ్, కార్యదర్శులుగా చింతాల లహరి, ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, నాంపల్లి ప్రశాంత్, కోశాధికారిగా గుర్రాల రాజిరెడ్డిని నియమించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నూతనంగా నియమించిన కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని రామచంద్రారెడ్డి కోరారు. పార్టీ సీనియర్ నాయకులు పొన్నాల తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, రంజిత్‌కుమార్, ఆంజనేయులు, బాలయ్య, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోయిన సెల్‌ఫోన్ అప్పగింత



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన తాళ్లపల్లి రాములు ఫోన్ దొరికింది. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు. నాలుగు రోజుల క్రితం రాములు ఫోన్ పోగా.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో సెల్‌ఫోన్‌ను గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. ఫోన్ రికవరీ చేసి బాధితుడు రాములుకు శనివారం అప్పగించినట్లు చెప్పారు.

యూత్ ట్రెండ్స్!

- ఆకట్టుకునే టాటూస్.. హెయిర్‌స్టైల్స్
- ట్రెండ్ ఫాలో అవుతున్న యువకులు
- ఉపాధి పొందుతున్న యువత



కొదురుపాకలో కమల్ మాట్రిక్స్ షాప్‌లో హెయిర్ కటింగ్



అందమైన హెయిర్ సెటప్‌తో బాలిక, చేతికి వేసుకున్న టాటూ

బోయినపల్లి: యూత్.. అంటేనే ట్రెండ్ సెట్టర్స్. ఫ్యాషన్‌రంగంలో వస్తున్న కొత్త పోకడాలను అందిపుచ్చుకుంటూ అందంగా.. ఆకర్షణీయంగా తయారవుతున్నారు. యూత్ ట్రెండ్స్‌ను పల్లెల్లోకి తెస్తూ పలువురు యువత నయా ఉపాధి పొందుతున్నారు. సోషల్‌మీడియా ప్రభావం పెరిగిపోవడంతో పల్లెల్లోనూ నయాట్రెండ్స్ ఫాలో అవుతున్నారు. యూత్ ఫ్యాషన్‌ట్రెండ్స్‌పై ఈ వారం సండే స్పెషల్..

టాటూస్ ట్రెండ్

యువతీ, యువకులు టాటూస్ వేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మనికట్టు, భుజాలు, చాతి.. ఇలా శరీర భాగాలపై అందమైన టాటూస్ వేయించుకుంటున్నారు. కొత్త రకమైన డిజైన్లతో పల్లెల్లో ట్రెండ్ సెట్ చేస్తున్నారు. వారిని చూసి పలువురు ఇదే ట్రెండ్ ఫాలో అవుతున్నారు.

అట్రాక్షన్ ఇయర్‌రింగ్స్

వారి అందానికి మరిన్ని హంగులు జోడించేందుకు యూత్ ఇయర్‌రింగ్స్ పెట్టుకుంటున్నారు. గ్రామాల్లోని యువకులు ఇయర్‌రింగ్స్ పెట్టుకోవడం సాధారణంగా మారింది. కళాశాల చదువులకు పట్టణప్రాంతాలకు వెళ్తున్న బాయ్స్ ఇయర్‌రింగ్స్‌తో గ్రామాల్లో అడుగుపెడుతున్నారు.

అదిరే హెయిర్‌స్టైల్

ప్రస్తుతం ఎక్కువగా హెయిర్‌స్టైల్స్‌పై దృష్టి పెడుతున్నారు. సెలూన్‌లో వెరైటీ హెయిర్ సెట్టింగ్స్ కోసం ఆన్‌లైన్ లో సెర్చ్ చేస్తున్నారు. అదిరే డిజైన్‌లను తమ హెయిర్‌తో ట్రై చేస్తున్నారు. సినిమాల్లో హీరోల హెయిర్ స్టైల్స్‌ను ట్రై చేస్తున్నారు. వేములవాడ, సిరిసిల్ల, బోయినపల్లి ప్రాంతాల్లో ఏసీ గదుల్లో అందమైన సెలూన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా సైతం యువత ఉపాధి పొందుతున్నారు.

వాహ్వా..డ్రెస్సింగ్స్

గ్రామాల్లోని యువతీ, యవకులు వేసుకునే డ్రెస్సింగ్స్ సైతం కొత్త ఫ్యాషన్‌గా ఉంటున్నాయి. జీన్స్, టీషర్ట్స్, పెన్సిల్‌కట్, బూట్‌కట్, మిర్చీ ప్యాంట్లతో యువకులు అదరగొడుతున్నారు. యువతులు లాంగ్ ఫ్రాక్, లాంగ్ చుడీదార్, గాగ్రా, స్కిన్ టైట్ ప్యాంట్లు, జీన్స్, టీషర్ట్స్, లెగ్గిన్స్, జెగ్గిన్స్, లాంగ్ టీషర్ట్, కలర్‌ఫుల్ టాప్స్‌లతో అదరగొడుతున్నారు.

హ్యాండ్‌బ్యాండ్స్ అదుర్స్

మణికట్టుకు అదిరే హ్యాండ్‌బ్యాండ్స్ వేసుకోవడం ఇప్పుడు నడుస్తున్న స్టైల్. చేతికి కర్చీఫ్‌ను బ్యాండ్‌లా చుట్టుకోవడం గ్రామాల్లో కనిపిస్తోంది. మార్కెట్‌లో ఉన్న వివిధ రకాల బ్యాండ్స్ చేతికి కట్టుకోవడం యువతకు ఫ్యాషన్‌గా మారింది.

హెయిర్‌స్టైల్స్‌పై ఇంట్రెస్ట్ చూపుతున్నారు



హెయిర్ సెట్టింగ్స్‌తోనే అందంగా కనిపిస్తారు. ఆకట్టుకునే హెయిర్‌కటింగ్ కోసం యువకులు ఆసక్తి చూపుతున్నారు. కొత్త..కొత్త స్టైల్స్‌లో కటింగ్ తీయించుకుంటున్నారు. యూత్‌కు తగ్గట్టు మేము కూడా అన్ని రకాల స్టైల్ హెయిర్‌కటింగ్స్ చేస్తున్నాం.
– సారంపల్లి కమల్, హెయిర్ సెలూన్ నిర్వాహకుడు, కొదురుపాక

టాటూస్ అంటే ఇష్టం



టాటూస్ అంటే నాకు చాలా ఇష్టం. అందమైన ఆకృతిలో టాటూస్ వేయించుకున్నాను. గతంలో ఉపాధి కోసం ఇరాక్ దేశం వెళ్లాను. అక్కడ నా ఫ్రెండ్స్‌ను చూసి నేను కూడా టాటూ వేయించుకున్నాను.
– సంబ మహిపాల్, బోయినపల్లి

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న ఆడెపు రవీందర్

సిరిసిల్లటౌన్: దేశ ప్రగతే లక్ష్యంగా బీజేపీ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమై ఉంటుందని పార్టీ పార్లమెంట్ కోకన్వీనర్ ఆడెపు రవీందర్ అన్నారు. శనివారం పట్టణంలోని శివనగర్ శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో జరిగిన పట్టణ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ నూతన కార్యవర్గం, పూర్వ కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గరిపెల్లి ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొండ నరేశ్, మేర్గు శ్రీనివాస్, అంకారపు రాజు, కంభోజ శ్రీధర్, నరసయ్య, కోడం రవి, సూరం వినయ్, ఎనగంటి నరేశ్, గాజుల సదానందం, ఊరగొండ రాజు, గుడ్ల విష్ణు, సుంకోజు రమేశ్ చారి, పండగ మాధవి, వేముల వైశాలి, పార్టీ నాయకులు కార్యకర్తలు బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: రైతుల నేస్తంగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ప్రజల హృదయాల్లో నిలిచిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మొర్రాయిపల్లెలో రైతు భరోసా సంబరాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ, రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, వైస్‌చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి రాజిరెడ్డి, గజ్జెల రాజు, రాగం కుమార్, అనిత, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ఇల్లంతకుంట: బహుమతులతో విద్యార్థులు

ఇల్లంతకుంట: పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకంగా వాసంతి దేవి చారిటబుల్ ట్రస్ట్ ఎస్ వెంకటరామారావు ఎడ్యుకేషన్ అందించడం అభినందనీయమని మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని దాచారం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాదిలో పదో తరగతి ఫలితాల్లో మండలంలో అధిక మార్కులు సాధించిన గొడుగు భావనకు రూ.50వేలు, మారవేని శరణ్యకు 30 వేలు, వాడే వర్షితకు రూ.20 వేలు చెక్కును అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు తూముకుంట నరేందర్ రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం తిరుపతి, భరత్ రావు, శరత్‌రావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బాలగౌడ్, పంచాయతీ కార్యదర్శి బాలరాజు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్ హైస్కూల్‌లో పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామానికి చెందిన బొల్లం శ్రీపాల్‌రెడ్డి, జీవన్‌రెడ్డిలు శనివారం నగదు బహుమతులు అందించారు. స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థికి రూ.5వేలు, రెండోస్థానంలో ఉన్న విద్యార్థులకు రూ.2,500 చొప్పున అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో సి.రామరాజు, లచ్చిరెడ్డి, ఐల శివరామ్, ద్వితీయచంద్, బాబు, రమేశ్, రామకిషన్, బాలయ్య, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

వీర్నపల్లి: మధ్యాహ్న భోజన కార్మికులు మండల విద్యాధికారి కార్యాలయం ముందు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకుడు మల్లారపు అరుణ్ కుమార్ మాట్లాడుతూ...మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, మెస్ చార్జీలు, గౌరవ వేతనం చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేసి కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్ కుమార్, మధ్యాహ్న భోజన కార్మికులు శ్యామల, లక్ష్మీ రాజవ్వ, భూదవ్వ, లింబవ్వ భారతి, దేవవ్వ, లక్ష్మి, గంగవ్వ, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనున్న అల్లూరి సీతారామారాజు విగ్రహం చుట్టూ చెట్ల కొమ్మలు అల్లుకోగా.. శనివారం అధికారులు వాటిని తొలగించారు. 'విగ్రహం చుట్టూ చెట్ల కొమ్మలే' అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. విగ్రహం చుట్టూ చెట్ల కొమ్మలు అల్లుకోవడంతో అది కనిపించకుండా పోయింది. అధికారులు విగ్రహంచుట్టూ పెరిగిన కొమ్మలు తొలగించడంపై గ్రామస్తులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

సన్మానం

ముస్తాబాద్: మద్దికుంట లక్ష్మణ్ ప్రధానోపాధ్యాయుడిగా, కవి, రచయితగా అందించిన సేవలు మరువలేనివని ఎంఈవో నిమ్మ రాజిరెడ్డి అన్నారు. లక్ష్మణ్ ఉద్యోగ విరమణ సందర్భంగా మండల వనరుల కేంద్రంలో కాంప్లెక్స్ సమావేశంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా విద్యరంగంలో లక్ష్మణ్ విశిష్ట సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాధాకిషన్‌రావు, సుధాకర్, రాజ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• విద్యుత్‌షాక్‌తో కోతులు మృతి

రుద్రంగి: మండలకేంద్రంలోని మానాల ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో దాదాపు 15 కోతులు శనివారం మృతిచెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోతులు ఒకేసారి గుంపుగా వచ్చి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి ఆడుతుండగా షాక్ తగిలి కిందపడి చనిపోయాయి.

• అన్ని ధ్రువపత్రాలు ఉండాలి

ఎల్లారెడ్డిపేట: ఇసుక ట్రాక్టర్లకు అనుమతి పత్రాలు ఉంటేనే రవాణాకు పర్మిషన్లు ఇవ్వనున్నట్లు తహసీల్దార్ సుజాత అన్నారు. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సుజాత మాట్లాడారు. మండలంలో ఇసుక రవాణాకు ప్రతి ట్రాక్టర్‌కు 10 రకాల పత్రాలు ఉండాలన్నారు. ఇసుకను తరలించే యజమానులు నేటినుంచి 15రోజుల్లోపు రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలన్నారు. దీంతోపాటు డ్రైవర్‌కు, వాహనానికి అన్ని ధ్రువపత్రాలు ఉండాలన్నారు.

• కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

బోయినపల్లి: మండలంలోని మల్కాపూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు కోరెపు నరేశ్ శనివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే సత్యం కండువా కప్పి నరేశ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్శితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే సత్యం పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, కొలుపుల ప్రవీణ్ ఉన్నారు.

• ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో పోచమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన బిట్ల బాబు రూ.5,116, జలగం దశరథరావు రూ.5,516 చొప్పున విరాళం అందజేశారు. గ్రామంలో ఇప్పటికే ఉన్న ఆలయం శిథిలం కావడంతో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. తాళ్లపెల్లి సతీష్‌గౌడ్, వీరవేణి తిరుపతియాదవ్ తదితరులు ఉన్నారు.

• తల్లీ కుమారుల అదృశ్యం



కోనరావుపేట: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ఊరడి లావణ్య ఈనెల 26నుంచి కనిపించడం లేదని భర్త లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లక్ష్మణ్‌తో గొడవ పడిన లావణ్య ఇద్దరు కుమారులు రాము (12), లక్ష్మణ్ (12)లను తీసుకుని ఈనెల 26న ఇంట్లోంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యంకాకపోవడంతో శనివారం కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై ప్రశాంత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. ముప్పై ఏళ్ల క్రితం నిర్మించిన పంచాయతీ భవనం పగుళ్లుబారింది. వర్షానికి ఉరుస్తోంది. దీంతో పంచాయతీ అధికారులు, సిబ్బందితోపాటు సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. దీంతోపాటు కార్యాలయం గదులు ఇరుకుగా ఉన్నాయి. నూతన భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
బీరయ్య, ఎంపీడీవో, సెల్‌నెంబర్:9676973358

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

బీడీ కార్మికులకు వేతనాలు అందించాలి



మాట్లాడుతున్న రమేశ్

సిరిసిల్లటౌన్: ఠాగూర్ సాదే కర్ బీడీ కంపెనీ యజమాన్యం కార్మికులకు ఆరునెలల వేతనాలు వెంటనే అందించాలని బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజువారీ కూలీతో పూట గడిపే కార్మికులకు ఆరునెలల నుంచి వేతనాలు యజమానికి ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. కార్మికులను శ్రమ దోపిడీని మానుకోకపోతే హైదరాబాద్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని, కార్మికులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సూరం పద్మ, శ్రీరాముల రమేశ్ చంద్ర, జిందం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



మాట్ల మధును అరెస్టు చేస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గజ్జెల కాంతం శనివారం సిరిసిల్ల పర్యటన సందర్భంగా తంగళ్లపల్లిలో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధును తంగళ్లపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో మధుకు బీఆర్ఎస్ ఇల్లంతకుంట మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి సంఘీభావం తెలిపి అక్రమ అరెస్టును ఖండించారు. మధును కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు ఎం డీ.సాదుల్, అనిల్, బొడ్డు శ్రీధర్, భాస్కర్ గౌడ్, కట్ట రవి, రమేశ్, సాయి తదితరులున్నారు.

పీవీకి ఘన నివాళి



సిరిసిల్ల టౌన్: బీఆర్ఎస్ భవన్‌లో పీవీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: మాజీ ప్రధాని దివంగత పీవీకి నరసింహరావు జయంతిని సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ..పీవి ఆశయాలు భావి తరాలకు స్ఫూర్తి దాయకమన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, గూడూరి ప్రవీణ్, లక్ష్మీనారాయణ, కుంభాల మల్లారెడ్డి, దార్ల సందీప్, లింగంపల్లి సత్యనారాయణ, దిడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, గిరిధర్‌రెడ్డి, రాజేందర్, బాలయ్య, శ్రీనివాస్, గుల్లపల్లి లక్ష్మారెడ్డి, బాబు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పీవీ నర్సింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, నాయకులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక



ఘనశ్రీ

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ ప్రాథమిక పాఠశాల (ఎస్సీ కాలనీ)కు చెందిన తాళ్లపెల్లి ఘనశ్రీ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కాశిపాక తిరుపతి తెలిపారు. మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఎంపికై జిల్లాస్థాయికి ఎంపికకాగా సిరిసిల్లలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంది. జూలై 1న హకీంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుంది. స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక కావడంపై పీడీ అజయ్‌కుమార్, చిన్నారి ఘనశ్రీని పలువురు అభినందించారు.

మాజీ జెడ్పీటీసీ భర్తపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

తంగళ్లపల్లి: మాజీ జెడ్పీటీసీ పూర్మాని మంజుల భర్త పూర్మాని లింగారెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది.మండెపల్లి మాజీసర్పంచ్ తంగళ్లపల్లి దేవయ్యపై గతేడాది సెప్టెంబర్ 4న పూర్మాని లింగారెడ్డితోపాటు పలువురు దాడిచేసిన ఘటనలో చర్యలు తీసుకోవాలని బాధితుడు దేవయ్య డీజీపీని కలవడంతో ఆయన ఆదేశాలతో సోమవారం తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైనట్లు బాధితుడు పేర్కొన్నాడు. లింగారెడ్డితోపాటు కూర అంజిరెడ్డి, ఆసాని శ్రీకాంత్ రెడ్డి, మిడిదొడ్డి ప్రశాంత్, తాటికొండ చందు, కోడం వేణు, కూర సాయిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్సై పేర్కొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని ఎస్సై రాహుల్‌రెడ్డి అన్నారు. నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రాహుల్‌రెడ్డిని శనివారం బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులతో పాటు కుల సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంఘాల సభ్యులు ఘనంగా సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు శ్రీనివాస్, బందారపు బాల్‌రెడ్డి, ఎడ్ల సందీప్, గుండాడి వెంకట్‌రెడ్డి, హసన్, తిరుపతి రెడ్డి, రేపాక రామచంద్రారెడ్డి, తదితరులున్నారు.

శ్రమదానం

ఇల్లంతకుంట: మండలంలోని కూన బోయినపల్లి వద్ద కుంగిన కల్వర్టును ఇల్లంతకుంట గ్రామ యువజన సంఘాల సభ్యులు శనివారం శ్రమదానం చేసి పూడ్చివేశారు. ఇక్కడ శుక్రవారం రాత్రి ముస్కాన్‌పేట గ్రామానికి చెందిన సంజీవరెడ్డి సైకిల్‌పై వెళ్తూ ప్రమాదానికి గురై మృతిచెందాడు. దీంతో గ్రామ యువకులు శ్రమదానంతో మరమ్మతులు చేపట్టారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు, చిట్టి ప్రదీప్ రెడ్డి, పరుశురాం, సిబ్బంది, పాల్గొన్నారు.